క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఆదివారం నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ.. మహదేవపురం సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మహదేవపురం కాలనీ, పంట కాలువ రోడ్డు, సనత్‌నగర్, కామయ్యతోపు సెంటర్, బందరు రోడ్డు, 80 అడుగుల రోడ్డులో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

కొత్త ఆటోనగర్‌లో..

కొత్త ఆటోనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఈఈ హరిబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఆటోనగర్ ఏ,బీ,సీ బ్లాకులు, వివాన్ విల్లా ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి భక్తుడు శనివారం రూ.లక్ష విరాళాన్ని ఇచ్చారు. విజయవాడ సమీపంలోని పోరంకికి చెందిన కోలా రామారావు, కళావతి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు. దాత దంపతులను అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



ఉయ్యూరు: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు టి.వనజ కోరారు. ఉయ్యూరు పట్టణంలోని ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల, ఐదో వార్డు ఎంపీపీ పాఠశాల పరిధిలో నేను బడికి పోతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు రామకృష్ణ, సీతామహాలక్ష్మి, ఎంఈఓ సుధారాణి, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) ఎండీ సాదతుల్లా, హెచ్ఎం షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉయ్యూరు అధ్యక్షుడిగా నేరెళ్ల



ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నేరెళ్ల తేజ సాయి వెంకట్ ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ కార్యవర్గ పదవీకాలం ముగియటంతో నూతన కమిటీని శనివారం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా నేరెళ్ల తేజ సాయి వెంకట్‌తో పాటు కార్యదర్శిగా నెల్లి రాంబాబు, కోశాధికారిగా వీణవాహి ప్రసాద్‌తో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని క్లబ్ డిస్ట్రిక్ట్ డెప్యూటీ క్యాబినెట్ కార్యదర్శి నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు డాక్టర్ రావులపల్లి సుధాకర్, కుటుంబరాజు, నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్ అభినందించారు.

అభివృద్ధికి ఎదురుచూపులు..

- శంకుస్థాపన అయ్యింది.. పనులకు మోక్షమెప్పుడో ?
- గుంతలతో అధ్వానంగా మద్దూరు – ఉప్పలూరు రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలతో అధ్వానంగా ఉన్న మద్దూరు - ఉప్పలూరు రోడ్డు

కంకిపాడు: రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన అయ్యింది. కానీ రోడ్డు పనులు మొదలుకాకపోవటంతో అధ్వానంగా ఉన్న రహదారిపై రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి ఇక్కట్లకు మద్దూరు–ఉప్పలూరు రోడ్డు కేరాఫ్‌గా మారింది.

అడుగుకో గొయ్యి..

మద్దూరు – ఉప్పలూరు వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. అడుగుకో గొయ్యితో ఛిద్రంగా మారింది. రహదారి మార్జిన్లు కోతకు గురై ప్రయాణం సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడటంతో బురదమయంగా తయారైంది. అడపా దడపా పడుతున్న వర్షాలకు రహదారి పొడవునా బురద మేట వేసుకుని ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగని దుస్థితి. రాత్రిళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నారు. విజయవాడ – దివిసీమ కరకట్ట నుంచి కంకిపాడు – గన్నవరం రోడ్డును కలిపే ప్రధాన రహదారి మార్గం. అటు విజయవాడ, దివిసీమ ప్రాంతాలకు, ఇటు గన్నవరం విమానాశ్రయానికి వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గాన్ని ప్రజలు వినియోగిస్తున్నారు.

రూ.19 కోట్ల నిధుల కేటాయింపు

మద్దూరు – ఉప్పలూరు రోడ్డు మార్గం మద్దూరు, వణుకూరు, గోసాల, ఈడుపుగల్లు గ్రామాల మీదుగా ఉప్పలూరు వద్ద కంకిపాడు – గన్నవరం రోడ్డును కలుస్తుంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.19 కోట్లు నిధులు కేటాయించారు. అప్పటి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ఈడుపుగల్లు ప్రధాన కూడలిలో శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన జరిగిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నూతన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. ఈ రోడ్డు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడితే మద్దూరు నుంచి ఉప్పలూరు వరకూ ఉన్న రోడ్డు మార్గానికి మోక్షం లభిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆరు నెలల్లో టిడ్కో గృహాలు అందిస్తాం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు: ఆరు నెలల్లో టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన సాధారణ, అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఉయ్యూరు పట్టణంలో టిడ్కో గృహాలు రాని 145 మంది లబ్ధిదారులకు డిపాజిట్ చెక్కు రూ.28,70,500ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులపై విశ్వాసం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. బాధ్యతతో, ప్రజా విశ్వాసానికి అనుగుణంగా పని చేస్తానని చెప్పారు. అర్హత ఉండి ఇళ్లు రాని లబ్ధిదారులకు గృహాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి సహకారంతో గృహాలను త్వరితగతిన పూర్తి చేస్తామని, అవసరమైన వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, టిడ్కో మేనేజర్ చిన్నోడు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు వారధులు



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు

పెనమలూరు: ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధులని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో శనివారం ఏపీ ఎన్జీవో సంఘ నేతలు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై ప్రభుత్వ ఉద్యోగులు స్పందించాలని కోరారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో కలిసి ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు కూడా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకటపురుషోత్తమరాజు, కార్యదర్శి కృష్ణారావు, సభ్యులు జిమ్మ విక్టర్, సురేష్, ఏడుకొండలు, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి



పెనమలూరులో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

పెనమలూరు: సచివాలయ సిబ్బంది జూలై 1, 2వ తేదీల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ కుమార్‌బాబు ఆదేశించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఏప్రిల్, మే, జూన్ పింఛన్ల బకాయి రూ.3 వేలు కలిపి పెంచిన పింఛన్ రూ.4 వేలతో లబ్ధిదారులకు మొత్తం పింఛన్ రూ.7 వేలు అందజేయాలన్నారు. మండల పరిధిలో పింఛన్ పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెనమలూరు మండలంలో పింఛన్ లబ్ధిదారులు 5,777 మంది లబ్ధిదారులకు రూ.2,56,47,500, తాడిగడప మున్సిపాలిటీలో 12,773 మంది లబ్ధిదారులకు రూ.8.77 కోట్లు నిధులు విడుదల చేశారు.

రూ.5.38 కోట్లు విడుదల

ఉంగుటూరు: జూలై ఒకటో తేదీనే నూరు శాతం సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ మహేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక విలేకరులతో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇంటి వద్దకే సామాజిక పింఛన్ల పంపిణీపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 8,041 సామాజిక పింఛన్లకు రూ.5.38 కోట్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. గ్రామాల్లో క్లస్టర్లుగా విభజించి తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

రూ.11.84 కోట్లు విడుదల

విజయవాడరూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను జూలై 1వ తేదీన పంపిణీ చేయడానికి 11 కోట్ల 84 లక్షల రూపాయలను విడుదల చేశామని ఎంపీడీఓ ఏ.శ్రీరమ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో 17,328 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడానికి గ్రామాల్లోని కార్యదర్శులకు నగదును విడుదల చేశామన్నారు. ఈ మొత్తాన్ని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామని ఎంపీడీఓ చెప్పారు.

లయన్స్ క్లబ్‌కు రూ.25 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్ అభివృద్ధికి వల్లభనేని రాజేష్ రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. ఆయన తండ్రి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వల్లభనేని త్రివేది జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని శనివారం లయన్స్ క్లబ్ ప్రతినిధి గూడవల్లి రత్నశేఖర్‌కు అందించారు. లయన్స్ క్లబ్ హాల్ ఆధునికీకరణ పనులకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు రత్నశేఖర్ తెలిపారు. పుర ప్రముఖులు వేగిరెడ్డి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించిన డీహెచ్



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని శనివారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి పరిశీలించారు. గ్రామంలో పీహెచ్‌సీ భవనాన్ని వెలగపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి పేరున వారి కుమారుడు వెలగపూడి రాజ్‌కుమార్ రూ.4 కోట్లు విరాళం ఇచ్చారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని అన్ని వసతులతో నిర్మించారు. ఈ భవనంలో వైద్య పరికరాలు కూడా ఏర్పాటు చేశారు. భవన పరిస్థితులను డీహెచ్ పద్మావతి డీఎంహెచ్‌వో గీతాబాయి, వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించి సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు పని చేసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. యనమలకుదురు, కానూరు గ్రామాలకు చెందిన వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తామన్నారు. త్వరలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ అవసరం

గన్నవరం రూరల్: తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి, టి.జితేంద్ర తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీటిని నిరంతరం క్లోరినేషన్ చేయించాలని, రక్షిత నీటి ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయించాలని, వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలను గమనించడంతో పాటు సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. అతిసారం, టైఫాయిడ్, వాంతులు, రక్తంతో కూడిన విరేచనాలు తదితర వ్యాధులు రాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో 35 కేసుల పరిష్కారం

ఉయ్యూరు: లోక్ అదాలత్‌లో 35 కేసులు పరిష్కరించామని జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి తెలిపారు. ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 29 క్రిమినల్, 4 సివిల్, రెండు చెక్ బౌన్స్ కేసులను విచారించి, పరిష్కరించామన్నారు. అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపి చంద్, న్యాయవాదులు చంటిబాబు, మోర్ల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలు

విజయవాడస్పోర్ట్స్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలను జూలై ఒకటో తేదీ సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 18 వ జాతీయ సాంఖ్యాక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంఖ్యాక శాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థీ సంఖ్యాక శాస్త్రంలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పోటీలలో విజేతలను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే బేసిక్ స్టాటిస్టిక్స్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె.నాగేశ్వరరావు, కె.అశోక్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని... ఆకలితో ఉన్నవారి కడుపునింపటంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండదని అన్న సంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. ఏలూరు రోడ్డులో శనివారం అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి సభ్యులు, దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నామన్నారు. ఇప్పటికే వన్‌టౌన్, పాత ప్రభుత్వాసుపత్రితో పాటు ఏలూరు రోడ్డులో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. అనంతరం 400 మందికి అన్నదానం చేశారు. సమితి సభ్యులు పందిరి విజయమోహన్, మద్దుల వెంకట శివరాం, దుర్గాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



యనమలకుదురులో శిక్షణ పొందిన మహిళలతో కాశిం తదితరులు

పెనమలూరు: మహిళలు చేతి వృత్తి పనులు నేర్చుకొని ఆర్థికాభివృద్ధి చెందడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. యనమలకుదురు వీఎల్ భవన్‌లో శనివారం మలాల యూసెఫ్ జాయ్ ఉమెన్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మహిళల బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు పంపిణీ చేసి ప్రసంగించారు. మహిళలు ఉపాధి అవకాశాలు పొంది ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. దీని కోసమే వీఎల్ భవన్‌లో మహిళలకు అనేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలాల యూసెఫ్ జాయ్ ఉమెన్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ ఇలియాస్, ఐద్వా నేతలు వలమా, జయలక్ష్మి, బ్యూటీషియన్ టీచర్ ఆయేషా, మహిళలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు తీర్మానం



సమావేశంలో అజెండాలోని అంశాలను వివరిస్తున్న కార్యదర్శి ప్రకాష్‌నాథ్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ శీలం రంగారావు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. తొలుత పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ అజెండాలోని పలు అంశాలను చదివి వినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రామంలోని సాలిపేట రోడ్డు, గంగానమ్మ డొంక, పోరంకి రోడ్డులోని పలు ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మాణానికి తీర్మానించారు. రామానగర్‌లో రెండు చోట్ల రహదారుల అభివృద్ధి, ఉలవచారు కంపెనీకి వెళ్లే రోడ్డుకు గ్రావెల్‌తో అభివృద్ధి నిమిత్తం, పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. రైల్వే గేటు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసమవడంతో మరమ్మతుల నిమిత్తం ఆర్‌అండ్‌బీ అధికారులను కోరేందుకు తీర్మానించారు. సమావేశంలో ఉప సర్పంచ్ అంకం రామకృష్ణ, ఎంపీటీసీ షేక్ రసూల్, వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వికాస్ కాలేజీ అధ్యాపకునికి డాక్టరేట్



సౌందర్యరాజన్‌ను అభినందిస్తున్న అకడమిక్ అడ్వైజర్ కీర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకునిగా పని చేస్తున్న డీఎస్ సౌందర్యరాజన్‌కు డాక్టరేట్ ఎం.జి.ఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ అందజేసింది. ఇస్లామ్ బేస్డ్ ఐడియాస్ విత్ మోడీఫైడ్ బ్లాక్ విండో ఆప్టిమిసేషన్ అల్‌గోర్థిమ్ ఫర్ ఎన్‌హేన్సింగ్ నెట్ వర్క్ సెక్యూరిటీ అనే అంశం మీద పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల అకడమిక్ అడ్వైజర్ నరెడ్ల కీర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ సౌందర్యరాజన్‌ను అభినందించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యార్థి నాయకులు



హాజరైన అతిథులు, పూర్వ విద్యార్థులు

గన్నవరం: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవార్చుకోవాలని ఎన్‌సీసీ 3(ఏ) ఆర్‌అండ్‌వీ కమాండింగ్ ఆఫీసర్ తీర్థప్రసాద్ విద్యార్థులకు సూచించారు. స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల, కళాశాల బాలుర నాయకుడు కె.వైభవ్, సత్యసాయి, బాలికల నాయకురాలు జె.జాగృతి, భూమిక, తరగతుల వారీగా క్యాబినేట్ విద్యార్థులతో ముఖ్య అతిథిగా పాల్గొన్న తీర్థప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా క్రీడా, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో ప్రోత్సాహించాలని చెప్పారు. ఈ దిశగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న సెయింట్ జాన్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు వి. తిరుమల తోడరమల్, టాన్యకుమారి, వసుంధరలక్ష్మి, కె.వాసుదేవ్, చైతన్య తదితరులు విద్యార్థి నాయకులను అభినందించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, సీనియర్ బ్రదర్లు సిజె.థామస్, జిమ్మికురియోకోస్, భల్లాజోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.